
సాక్షి
గుంటూరు
శనివారం । 19 । ఆగస్టు । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 4,513 క్యూసెక్కులు విడుదల చేశారు.



పసుపు కొమ్ముల అలంకారం

పెదకాకాని : భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాసం మొదటి శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు.

బండ్లమ్మ అమ్మవారికి పూజలు



పిట్టలవానిపాలెం: చందోలులోని బగళాముఖ బండ్లమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మహాలక్ష్మిగా.. అభయ ప్రదాయినిగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు జరిపించారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరునికి రూ.32.53 లక్షల హుండీ ఆదాయం



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లీలావతి సమక్షంలో 12 హుండీలను తెరచి అందులో ఉన్న నగదును భక్తులతో లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపీనాథ శర్మ మాట్లాడుతూ హుండీల ఆదాయం మొత్తం రూ. 30,88,133, అలాగే అన్నదాన మండపంలోని హుండీల ద్వారా రూ.1,64,953 వచ్చినట్లు తెలిపారు. అలాగే 206 గ్రాముల వెండి, 5 గ్రాముల 800 మిల్లీగ్రాముల బంగారం హుండీ ద్వారా భక్తులు అమరేశ్వరునికి సమర్పించినట్లు తెలిపారు. ఈ నగదు మొత్తాన్ని బ్యాంకులలో ఉన్న దేవాలయ ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు.

నేడు సర్పంచ్, ఏడు వార్డుస్థానాలకు ఎన్నికలు

గుంటూరు వెస్ట్ : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వివిధ కారణాలతో ఖాళీ అయిన సర్పంచ్, ఏడుగురు వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల నిర్వహణ జిల్లా పంచాయతీ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం జరగనున్న ఈ ఎన్నికల్లో తెనాలి మండలం బుర్రిపాలెం సర్పంచ్ పదవికి ఐదుగురు పోటీ చేస్తున్నారు. చేబ్రోలు మండలం గుండవరం, తోటిపాలెం, ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు, పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంట పాలెం, రావిపాడు, వరగానిలలో మొత్తం 7 వార్డు మెంబర్లకు 15 మంది పోటీ పడుతున్నారు. నేటి సాయంత్రానికి ఫలితాలు కూడా ప్రకటిస్తారు.

మల్లేశ్వరస్వామి దర్శనం



పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయానికి దేవదాయ శాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ టి.చంద్రకుమార్ దంపతులు విచ్చేశారు. వారికి సహాయ కమిషనర్ ఎస్.శ్రీనివాస్ రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అదనపు కమిషనర్ దంపతులు స్వామిని దర్శించుకుని అభిషేక పూజల్లో పాల్గొన్నారు. స్వామి శేష వస్త్రంతో ఆదనపు కమిషనర్‌ను సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో చంద్రకుమార్ దంపతులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో శాఖ ఉప కమిషనర్ ఈమని చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

వీఆర్‌లోకి 'ఆ ముగ్గురు'

సాక్షి ఎఫెక్ట్

తెనాలి: 'ఆ పోలీసుల తీరే వేరు' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. సివిల్ పంచాయతీలో తలదూర్చటంతో సహా పనితీరుపైనా విమర్శలు రావడంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఏఎస్‌ఐ, కానిస్టేబుల్, త్రీటౌన్‌కు చెందిన మరో కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు సమాచారం. ఆ ముగ్గురిని వీఆర్‌లోకి పంపారు. ఆ ప్రకారం వారికి శుక్రవారం సాయంత్రం పాస్‌పోర్టునిచ్చి పంపినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

గుంటూరు డివిజన్ మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజన్ మీదుగా పలు పనులు చేపట్టిన నేపథ్యంలో డివిజన్ మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేసినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్ 17299.. గుంటూరు- విశాఖపట్నం శనివారం నుంచి 21 వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్టు తెలిపారు. విశాఖపట్నం-గుంటూరు(17240) ఈనెల 20 నుంచి 22 వరకు, గుంటూరు-నర్సాపూర్(17281) రైలు శనివారం నుంచి 21 వరకు, నర్సాపూర్-గుంటూరు(17282) శనివారం నుంచి 22 వరకు, గుంటూరు- డోన్(17228) రైలు శనివారం నుంచి 21వ తేదీ వరకు, డోన్- గుంటూరు(17227) మీదుగా ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు, నర్సాపూర్- గుంటూరు (07281) రైలును శనివారం నుంచి 21వ తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు వెల్లడించారు.

వేళంగణికి ప్రత్యేక రైలు..

సికింద్రబాద్- వేళంగణి(07161) ఈనెల 27, 29 తేదీలలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైలు గుంటూరు డివిజన్ మీదుగా కేటాయించినట్లు తెలిపారు. వేళంగణి-సికింద్రబాద్ (07162) రైలు ఈనెల 29, 31వ తేదీలలో ప్రత్యేక రైలును నడపనున్నట్టు వివరించారు.

'శిస్తు' రక్షణ

అక్రమాలకు చెక్

- త్వరలో ఆన్‌లైన్‌లోనే పంచాయతీ పన్ను వసూళ్లు
- సర్వంసిద్ధం చేసిన అధికారులు
- 222 గ్రామాలలో బ్యాంకు ఖాతాలు ప్రారంభం
- క్యూఆర్ కోడ్, స్వైపింగ్ యంత్రాల కోసం వెయిటింగ్
- గతంలో వసూలు చేసిన సొమ్ము పక్కదారి
- పలువురు పంచాయతీ కార్యదర్శులపై చర్యలు
- ఆన్‌లైన్ అయితే జవాబుదారీతనం
- జిల్లాలో పన్ను వసూలు మొత్తం ఏడాదికి రూ.42 కోట్లు



జొన్నలగడ్డ గ్రామ సచివాలయం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గ్రామ పంచాయతీలలో జరిగే పన్ను అక్రమాలకు చెక్ పడనుంది. పంచాయతీలలో పన్నుల వసూలు ఇకపై ఆన్‌లైన్‌లో జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. అన్ని గ్రామ పంచాయతీలలో పన్నుల వివరాలను ఆన్‌లైన్ చేయించారు. కొత్తగా వసూళ్ల కోసం బ్యాంక్ ఖాతాలను తెరిపించారు. బ్యాంకులలో గ్రామస్తులు చెల్లించిన పన్నులు జమ చేసేందుకు స్వైపింగ్ మిషన్లు, క్యూఆర్ కోడ్‌ల కోసం అధికారులు వేచి చూస్తున్నారు. అవి రాగానే జిల్లాలోని 222 గ్రామ పంచాయతీలలో ఆన్‌లైన్ ద్వారా నగదు జమ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. గతంలో ఆఫ్‌లైన్‌లో నగదు వసూళ్లు జరిగినప్పుడు పలు అక్రమాలు చోటు చేసుకునేవి.

ఇవిగో గత అనుభవాలు

- వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు కార్యదర్శి పంచాయతీ సొమ్మును సొంతానికి వాడుకున్నారు. సుమారు ఐదు లక్షల రూపాయలకు పైగా గ్రామస్తుల నుంచి వసూలు చేసిన ఆస్తి పన్ను మొత్తాన్ని స్వాహా చేశారు. మరో 20 లక్షల రూపాయల వరకు బిల్లులు లేకుండానే నగదు డ్రా చేశారు.

– పెదకాకాని మండలం నంబూరులో 2.99 కోట్ల రూపాయలు అవినీతి జరిగినట్లు లెక్క తేలడంతో సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయడంతో పాటు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇద్దరు గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శులను, ఇద్దరు బిల్ కలెక్టర్లు, ఒక జూనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

- చేబ్రోలు, కొల్లిపర మండలం మున్నంగి, వట్టిచెరుకూరు మండలం ముట్లూరు, దుగ్గిరాల మండలం చిలువూరు పంచాయతీలపై విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు.
- జొన్నలగడ్డ పంచాయతీలో కూడా అవినీతి వెలుగు చూసింది. కార్యదర్శి పన్నుల వసూలులో కొత్త విధానానికి తెరలేపారు. గ్రామస్తుల వద్ద ఆస్తి పన్ను కట్టించుకున్నప్పుడు దానిపై ఉన్న మొత్తానికి, ఆఫీసులో జమ చేసిన మొత్తానికి అసలు సంబంధమే లేదు. దీని కోసం రెండు బిల్లు పుస్తకాలు వాడారు. ఒకటి పన్నుదారులకు ఇస్తే మరొకటి పంచాయతీ కార్యాలయంలో లెక్కలు రాసేందుకు వాడినట్లు విచారణలో తేలింది. ఒకరి వద్ద రెండు వేల రూపాయల పన్ను కట్టించుకుని వారికి ఆ మేరకు రశీదు ఇస్తే, పంచాయతీ ఆఫీసులో మాత్రం ఐదు వందల రూపాయలు మాత్రమే జమ చేశారు. ఇలా పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారు.

ఇకపై అక్రమాలు జరిగే అవకాశం లేదు



గ్రామ పంచాయతీలలో త్వరలో ఆన్‌లైన్ ద్వారా పన్నుల వసూలు కోసం అన్ని చర్యలు చేపట్టాం. ఈ విధానం అమలులోకి వస్తే అవినీతికి అవకాశం ఉండదు. ఇప్పటికే అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాం. వారు వాడుకున్నవి వసూలు చేశాం. భవిష్యత్‌లో ఇటువంటి అక్రమాలకు ఏ మాత్రం అవకాశం ఉండదు.

– కేశవరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి

ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరిగితే, సంబంధిత అసెస్‌మెంట్‌దారుడు ఎంత పన్ను కట్టాల్సి ఉంది, ఎంత కట్టాడు, ఎంత బకాయి ఉన్నది వారు స్వయంగా తెలుసుకునే అవకాశం ఉన్నందున అవినీతికి ఆస్కారం ఉండదు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 520.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 860.40 అడుగుల వద్ద ఉంది.



మాపటేల మహిళలే లక్ష్యంగా..

బంగారు గొలుసుల చోరీ

- నలుగురి సభ్యుల ముఠా అరెస్ట్
- అందరి వయస్సు 30లోపే..
- బంగారం తనఖాపెట్టి నగదు తీసుకొచ్చే వ్యక్తికీ అరదండాలు
- రూ.68 లక్షల బంగారం, రెండు బైక్‌లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసులను పరిశీలిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): బైక్‌లపై ప్రయాణించే మహిళల మెడల్లోని బంగారు గొలుసులు తెంచుకెళ్లే నలుగురి యువకుల ముఠాను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వయస్సు 30 ఏళ్ల లోపే కావడం గమనార్హం. వీరితోపాటు చోరీ బంగారం తనఖా పెట్టి, నగదు తీసుకొచ్చే వ్యక్తిని కూడా పోలీసులు అరెస్టు చేసి రూ.68 లక్షలు ఖరీదు చేసే 1,243 గ్రాముల బంగారు గొలుసులు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాలులో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ కేసుల వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం..

ఆ రెండు గంటల్లోనే..

ఉత్తర సబ్ డివిజన్‌లోని మంగళగిరి పట్టణ, మంగళగిరి రూరల్, తాడేపల్లి, పెదకాకాని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల బంగారు గొలుసుల చోరీ కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. ఈ వరుస చోరీలన్నీ ఓ పద్ధతి ప్రకారం జరుగుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా రాత్రి 7.30 గంటల నుంచి 9.30 గంటల మధ్యే ఈ చోరీలన్నీ జరిగినట్టు నిర్ధారించుకుని దొంగల కోసం మంగళగిరి రూరల్, సీసీఎస్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మంగళగిరి కొత్తపేటలో ఉంటున్న మచ్చ వెంకటేశ్ అలియాస్ రవీంద్రారెడ్డి అలియాస్ నాని, మంగళగిరి టౌన్ లక్ష్మీనరసింహ కాలనీ వాసి పఠాన్ సలీంబాష అలియాస్ బాష, తాడికొండ మండలం కంతేరు గ్రామానికి చెందిన పలగాని మోహన్‌కృష్ణ, మంగళగిరి కొత్తపేటకు చెందిన తోట సాయి చోరీలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరితోపాటు చోరీ బంగారాన్ని తనఖాపెట్టి నగదు తెచ్చే మంగళగిరి టౌన్ కొప్పురావుకాలనీ వాసి చేకూరి మల్లేశ్వరరావునూ అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం రుజువు కావడంతో మొత్తం 39 కేసుల్లో ఈ ఐదుగురినీ అరెస్ట్ చేసి, రూ.68 లక్షలు ఖరీదు చేసే 1,243 గ్రాముల బంగారం, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

ప్రతిభకు ప్రశంస..

ఆధారాల్లేని ఈ కేసులను చాకచక్యంగా ఛేదించిన ఉత్తర సబ్‌డివిజన్ డీఎస్పీ జె.రాంబాబు, మంగళగిరి రూరల్ సీఐ వి.భూషణం, ఎస్‌ఐలు జె.క్రాంతికిరణ్, డి.వినోద్‌కుమార్, ఎ.శ్రీనివాసరెడ్డి, హెచ్‌సీ రమేష్, కానిస్టేబుళ్లు సుబ్బారెడ్డి, శివరామకృష్ణ, చిన్నమనాయుడు, అనీల్‌కుమార్, కల్యాణ్ సిబ్బందిని ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలను అందించారు. సమావేశంలో ఏఎస్పీ (క్రైం) శ్రీనివాసరావు ఉన్నారు.

మచ్చ వెంకటేశ్.. మారినట్టే మారి

చాకచక్యంగా బంగారు గొలుసులు దొంగిలించే మచ్చ వెంకటేశ్ 2013–14లో పలు కేసుల్లో అరెస్టై, జైలుకెళ్లాడు. జైలు నుంచి విడుదలయ్యాక పెళ్లి చేసుకుని ఏడాదిన్నరపాటు చోరీలకు విరామం పలికాడు. మారినట్టే మారి మళ్లీ దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. మరో నలుగురితో కలిసి ముఠాగా ఏర్పడి ద్విచక్రవాహనాలపై వెళ్లే మధ్య వయసు మహిళలనే లక్ష్యంగా చేసుకున్నాడు. మిగతా సభ్యులు బైక్ నడిపితే మచ్చ వెంకటేశ్ బైక్ వెనుక కూర్చుని బంగారు గొలుసులను చాకచక్యంగా తెంచేవాడు. ఒక్కొక్కసారి బైక్‌పై ముగ్గురు వెళ్లేవారు. వీరు గుంటూరు లాలాపేట, పాతగుంటూరు పీఎస్ పరిధిలోనూ గొలుసు చోరీలకు పాల్పడ్డారు. వీరు దొంగలించిన సొత్తుని చేకూరి మల్లేశ్వరరావు నగదు రూపేణా మార్చేవాడు.

టీసీల కోసం ప్రదక్షిణ'లా'!

- ఏసీ లా కళాశాల చుట్టూ తిరిగిన విద్యార్థులు
- యాజమాన్యం వైఖరిపై కలెక్టర్‌కు ఫిర్యాదులు
- కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీఓ ప్రభాకర్‌రెడ్డి విచారణ
- వెంటనే టీసీలు జారీ చేసిన ప్రిన్సిపాల్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ (ఏసీ) లా కళాశాలలో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసిన విద్యార్థులకు టీసీలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. విచారణకు ఆర్డీఓను ఆదేశించారు. దీంతో శుక్రవారం కళాశాలకు వచ్చి విచారణ జరిపించిన ఆర్డీఓ అక్కడికక్కడే విద్యార్థులకు టీసీలను జారీ చేయించారు.

అసలేం జరిగిందంటే..

ఏసీ లా కళాశాలలో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసిన 300 మంది విద్యార్థులకు టీసీలు జారీ చేయాల్సి ఉంది. అయితే 16 మందికి మాత్రమే ఇచ్చారు. కళాశాలలో ప్రిన్సిపాల్ స్థానంపై ఇద్దరి మధ్య నెలకొన్న వివాదమే టీసీల జారీకి ప్రతిబంధకంగా మారింది. కళాశాల మేనేజ్‌మెంట్ బోర్డు ద్వారా అమృత వర్షిణి ప్రిన్సిపాల్‌గా నియమితులు కాగా, న్యాయస్థానం నుంచి ఆర్డర్ తెచ్చుకున్న గురవయ్య కూడా ప్రిన్సిపాల్ పోస్టులో సమాంతరంగా కొనసాగుతున్నారు. దీంతో కళాశాలలోని కార్యాలయ సిబ్బందికి టీసీలు జారీ చేసే విషయమై స్పష్టత కరువైంది. దీంతో విద్యార్థులు పూర్తి ఫీజు చెల్లించినా టీసీలు జారీ చేయలేదు. ఫలితంగా పలువురు విద్యార్థులు విషయాన్ని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. దీంతో శుక్రవారం గుంటూరు ఆర్డీఓ ప్రభాకర్‌రెడ్డి కళాశాలకు వచ్చి గురవయ్య, అమృతవర్షిణితో వేర్వేరుగా మాట్లాడారు. అదే సమయంలో టీసీల కోసం పెద్ద సంఖ్యలో వచ్చిన విద్యార్థులతోనూ మాట్లాడారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ ప్రిన్సిపాల్‌గా ఎవరు కొనసాగుతారనేది తమకు అనవసరమని, టీసీలు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం తగదని స్పష్టం చేశారు. అక్కడి నుంచే కళాశాల విద్య ఆర్జేడీ వీఆర్ జ్యోత్స్నకుమారితోపాటు ఏఎన్‌యూ రిజిస్ట్రార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆర్డీఓ జోక్యంతో దిగి వచ్చిన కళాశాల ప్రతినిధులు విద్యార్థులకు టీసీల జారీకి చర్యలు చేపట్టింది. ఆయన వెంట గుంటూరు తూర్పు తహసీల్దార్ నాగేష్ ఉన్నారు.

అనధికారిక వసూళ్లపై ఆర్డీఓకు ఫిర్యాదు

ఏసీ లా కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు బ్లేజర్ (కోటు) కొనుగోలు నిమిత్తం అనధికారికంగా డబ్బులు వసూలు చేశారని పలువురు విద్యార్థులు ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.3,500 చొప్పున ఎటువంటి రశీదు లేకుండా వసూలు చేశారని, దీనిపై కళాశాల సిబ్బంది సమాధానం చెప్పడం లేదని వివరించారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇస్తే చర్యలు చేపడతామని ఆర్డీఓ ప్రభాకర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు.

ఆశాజనకంగా ఫ్యామిలీ డాక్టర్ అమలు

- మరింత చురుగ్గా ముందుకు
- కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: సుస్థిర అభివృద్ధి సాధించాలంటే ముందుగా నిర్ణయించుకున్న లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాలులో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్ద పీట వేస్తోందన్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి 10 నెలలు అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు కార్యక్రమం అమలు ఆశాజనకంగా ఉన్నా మరింత చురుగ్గా గ్రామాల్లోకి వెళ్లాలన్నారు. గ్రామాల్లో పర్యటించే సమయంలో స్థానికుల నుంచి వైద్యులు అభిప్రాయాలు సేకరించాలన్నారు. వైద్యం, మందుల పంపిణీ తదితర విషయాల్లో మరింత ప్రగతి సాధించాలన్నారు. చికిత్స చేసిన వెంటనే ఆ వివరాలను నమోదు చేయాలన్నారు. జిల్లా వైద్య శాఖాధికారి, నోడల్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. పీహెచ్‌సీలలో కాన్పుల సంఖ్య కొంత తగ్గిందని, వీలైనంత వరకు ప్రసవాలు చేపట్టాలన్నారు. గర్భిణులను ప్రైవేటు వైద్యశాలలకు పంపడం తగ్గించాలని చెప్పారు. రక్తహీనత ఉన్న విద్యార్థులకు, బాలింతలకు నిరంతరం వైద్య పరీక్షలు నిర్వహించి, అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్, సీపీఓ ఉషశ్రీ, ఐసీడీఎస్ మనోరంజని, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

దసరా నాటికి గృహ ప్రవేశాలు

- పసుమర్రు లేఅవుట్‌లో కనీసం 1,500 ఇళ్లు పూర్తి కావాలి
- జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి
- వెంటనే వసతులు సమకూర్చాలి
- సీఎం ఆశయాలు నెరవేర్చాల్సిన బాధ్యత అందరిదీ
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- గృహ నిర్మాణాలపై ఉన్నతాధికారులతో సమీక్ష



పసుమర్రు లేఅవుట్‌ను పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: జగనన్న కాలనీల్లో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లన్నీ దసరా నాటికి పూర్తి చేసి, గృహ ప్రవేశాలకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సంబంధించి పూర్తి స్థాయి సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా పసుమర్రు లేఅవుట్‌ను హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీశా, కలెక్టర్ లోతేటి శివశంకర్, ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో ఏర్పాటు చేసిన సమీక్షలో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని చెప్పారు. దసరా నాటికి పసుమర్రు లేఅవుట్‌లో 1,500 ఇళ్ల నిర్మాణం పూర్తికావాలని ఆదేశించారు. అన్ని లేఅవుట్లలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మంచినీటి వసతి, విద్యుత్, డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణాలు పూర్తి కావాలని సూచించారు.

ఇళ్లు లేని పేదలంటూ ఉండరాదు

నియోజకవర్గ పరిధిలో ఇళ్లు లేని పేదలంటూ ఉండటానికి వీల్లేదని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని పేర్కొన్నారు. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి పూర్తి స్థాయిలో సహకరించాలని చెప్పారు. వారికి బిల్లులు వెంటనే మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పసుమర్రు లేఅవుట్‌కు అప్రోచ్ రోడ్డును అభివృద్ధి చేయాలన్నారు. ఇళ్లు మంజూరైనా నిర్మాణాలు మొదలు పెట్టని లబ్ధిదారులతో వెంటనే సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. వారితో మాట్లాడి వెంటనే ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని, పక్కన హౌసింగ్ ఎండీ లక్ష్మీశా, కలెక్టర్ శివశంకర్

అన్ని విధాలా అండగా..

హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీశా మాట్లాడుతూ లబ్ధిదారులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు. బిల్లులు వెంటనే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. చిలకలూరిపేట అర్బన్ పరిధిలోని పసుమర్రు లేఅవుట్ రాష్ట్రంలోనే అతి పెద్ద లేఅవుట్లలో ఒకటని వెల్లడించారు. నియోజకవర్గంలోని లేఅవుట్లు మొత్తాన్ని మోడల్ కాలనీలుగా అభివృద్ధి చేస్తామని వివరించారు.

అప్రోచ్ రోడ్ల అభివృద్ధి

కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ లేఅవుట్లకు అప్రోచ్ రోడ్లను వెంటనే అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎస్.వేణుగోపాలరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, హౌసింగ్ ఈఈ బి.శివలింగం, డీఈఈ ఎస్.వెంకట్రావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతుళ్లు మృతి



ఘటనాస్థలంలో మరణించిన యెనుముల నరసింహారావు, శ్రీనిధి

పిడుగురాళ్ల: నోట్ పుస్తకాల కొనుగోలుకు వెళ్లిన తండ్రీకూతుళ్లు ద్విచక్రవాహనంపై సంతోషంగా ఇంటికి తిరిగి వస్తుండగా ఆగి ఉన్న లారీ రూపంలో దారి కాచిన మృత్యువు కబళించింది. ఆ కుటుంబంలో తీరని విషాదం నింపింది. ఈ హృదయ విదారక ఘటన శుక్రవారం రాత్రి పిడుగురాళ్ల మండలంలోని బ్రాహ్మణపల్లి సమీపంలోని శ్రీనివాస్‌నగర్ వద్ద జరిగింది.

పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ సమీపంలోని అయ్యప్పనగర్‌కు చెందిన యెనుముల నరసింహారావు(39)కు భార్య, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. ఇటీవలే పెద్ద కుమార్తెకు పెళ్లిచేశాడు. రెండో కుమార్తె శ్రీనిధి (17) పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమెకు నోట్ పుస్తకాల కొనుగోలు కోసం శుక్రవారం సాయంత్రం బ్రాహ్మణపల్లికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గమధ్యలో శ్రీనివాస్‌నగర్ వద్ద రోడ్డు పక్కనే ఆగిఉన్న లారీని గమనించకుండా ఢీకొట్టారు. దీంతో నరసింహారావు, శ్రీనిధి తలలకు బలమైన గాయాలు కావటంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్‌ఐ పవన్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్గదర్శి బ్రాంచిల్లో రెండో రోజూ సీఐడీ తనిఖీలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచ్ కార్యాలయాల్లో రెండో రోజు సీఐడీ విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని గుంటూరు అరండల్‌పేట, తెనాలి, పల్నాడు జిల్లా నరసరావుపేట, బాపట్ల, చీరాలలోని బ్రాంచి కార్యాలయాల్లో గురువారం ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా సోదాలు చేపట్టిన విషయం విదితమే.. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి, గుంటూరు జిల్లాలోని తెనాలి బ్రాంచిల్లో సోదాలు నిర్వహించారు. ఈ రెండు బ్రాంచిల్లో చందదారుల వివరాలను సేకరించారు. పలు రికార్డులను నిశితంగా పరిశీలించారు.

క్లుప్తంగా

జిల్లాలో 31.3 మి.మీ సగటు వర్షపాతం

ప్రత్తిపాడులో 74.2 మి.మీ వర్షం

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 74.2 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా తుళ్లూరు మండలంలో 1.2 మి.మీ వర్షం పడింది. సగటున 31.3 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. తాడికొండ 70.2, చేబ్రోలు 60.2, తెనాలి 44.4, గుంటూరు పశ్చిమ 42.4, గుంటూరు తూర్పు 40.2, దుగ్గిరాల 38.6, పొన్నూరు 38.6, పెదకాకాని 38, కొల్లిపర 33.4, మేడికొండూరు 33, కాకుమాను 13.8, పెదనందిపాడు 10.2, వట్టిచెరుకూరు 8.2, ఫిరంగిపురం 6.8, మంగళగిరి 5.4, తాడేపల్లి మండలంలో 4.6 మి.మీ చొప్పున వర్షం పడింది. ఆగస్టు మాసంలో 18వ తేదీ వరకు సగటు వర్షపాతం 95.6 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, ఇప్పటి వరకు 76.1 మి.మీ వర్షపాతం నమోదైంది.

యార్డులో 32,393 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 29,858 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 32,393 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,190 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఉద్యోగుల స్పందనకు హాజరు కావాల్సిందే

- అధికారులకు కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశం
- రాని వారికి షోకాజ్ నోటీసులు



ఉద్యోగుల అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో శుక్రవారం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే స్పందన కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పకహాజరు కావాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందింలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమానికి హాజరుకాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఏదైనా పని ఉండి వెళ్లాల్సి వస్తే తన అనుమతి తీసుకోవాలన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం మన బాధ్యతన్నారు.

ప్రతినెలా స్వీకరించే అర్జీలు మళ్లీ వచ్చే స్పందనలో పరిష్కారం కావాలన్నారు. ఏదై నా కారణాలతో పరిష్కరించకపోతే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. జేసీ పవర్ పా యింట్ ప్రజంటేషన్ ద్వారా గత నెల సమస్యల పరిష్కారాన్ని వివరించారు. అనంతరం వచ్చిన 29 ఫిర్యాదులను కలెక్టర్, జేసీ, డీఆర్వో చంద్రశేఖర రావు, జిల్లా అధికారుల పరిశీలించారు.

ఉద్యోగోన్నతి పొందిన సీఐలకు పోస్టింగ్‌లు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): గుంటూరు రేంజ్‌లో కొద్ది రోజుల క్రితం పలువురు ఎస్‌ఐలు సీఐలుగా ఉద్యోగోన్నతి పొందిన విషయం విదితమే. ఈ క్రమంలో ఉద్యోగోన్నతి పొందిన సీఐలకు పోస్టింగ్‌లు కల్పిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాల్‌రాజు ఉత్తర్వులు జారీచేశారు.

ఎస్‌ఐ పేరు	- ప్రస్తుతం-	జిల్లా/ యూనిట్
ఎ.భాస్కర్	- పల్నాడు జిల్లా	- సీసీఎస్ పల్నాడు జిల్లా
ఎస్.వెంకటేశ్వరరావు	- పల్నాడు జిల్లా	- ఎస్‌సి, ఎస్‌టి సెల్ పల్నాడు జిల్లా
పోలూరి శ్రీనివాసరావు	- ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా	- డీసీఆర్‌బీ, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా
సి.కృష్ణారెడ్డి	- తిరుపతి జిల్లా-	- కమాండ్ కంట్రోల్, తిరుపతి
ఎస్.నాగూర్ మీరాసాహెబ్	- బాపట్ల జిలా	-దిశ, బాపట్ల జిల్లా
జి.అనురాధ	- గుంటూరు జిల్లా	- డీసీఆర్‌బీ గుంటూరు జిల్లా
ఇ.నారాయణ	- బాపట్ల జిల్లా	-ఎస్‌సి, ఎస్‌టి సెల్, బాపట్ల జిల్లా
కె.అజయ్‌కుమార్	- ప్రకాశం జిల్లా	- ఎస్‌సి, ఎస్‌టి సెల్, ప్రకాశం జిల్లా
కుమ్మరి శ్రీనివాసరావు	- గుంటూరు జిల్లా	- ఎస్‌సి, ఎస్‌టి సెల్, గుంటూరు జిల్లా
జి.వెంకట నారాయణ	- ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిలా	- ఎస్‌సి, ఎస్‌టి సెల్-1, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా
డి.వెంకటేశ్వరరావు	- ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా	- సీసీఎస్, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా
కె.మల్లిఖార్జునరావు	- ప్రకాశం జిల్లా	- ట్రాఫిక్, ప్రకాశం జిల్లా
అవుల వెంకటేశ్వర్లు	- ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా	-ఎస్‌సి, ఎస్‌టి సెల్ 2, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా

మిర్చియార్డులో మౌలిక వసతులు కల్పిస్తాం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో మెరుగైన మౌలిక వసతుల కల్పన కోసం యార్డు అధికారులు, పాలకవర్గం సమన్వయంతో శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ స్పష్టం చేశారు. యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో మిర్చి దిగుమతి వ్యాపారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.మిర్చి రైతులకు మంచి ధర లభించేలా చూడాలని ఆయన సూచించారు. సమావేశంలో మిర్చి యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, అధికారులు సుబ్రమణ్యం, శివారెడ్డి, మిర్చి దిగుమతి వ్యాపారుల అసోసియేషన్ నాయకులు లేళ్ల పెద అప్పిరెడ్డి, నరేంద్ర, కోటేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

ఖచ్చితమైన పంట నమోదు చేయండి



మాట్లాడుతున్న జేసీ రాజకుమారి. వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా

ఈ–క్రాప్ నమోదుపై జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి సూచన

గుంటూరు వెస్ట్: ఈ–క్రాప్ నమోదు సమయంలో రైతు వేసే పంటను ఖచ్చితంగా నమోదు చేస్తే విక్రయించేటప్పుడు ఇబ్బందులుండవని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక డీఆర్సీ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ ఎస్.శివరామకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో జేసీ మాట్లాడుతూ ఇప్పటి వరకు 4760 ఎకరాలు ఈ–క్రాప్ బుకింగ్‌లో నమోదైందన్నారు. దీనికోసం జియో కో–ఆర్డినేట్స్‌లో పంట ఫొటోలు తీయాలన్నారు. జిల్లాలో ఇప్పటికే గుర్తించిన 36,644 మంది కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు అందజేశామన్నారు. వీరిలో 2389 మందికి రూ.15.36 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. రైతుల కోరిక మేరకు రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ ద్వారా జింక్ సల్ఫేట్ 21 శాతాన్ని సరఫరా కోసం టెండర్లు పిలిచామన్నారు. గ్రామాల్లో పొలాల్లోకి వెళ్లే మార్గంలో డొంక రోడ్డుల నిర్మాణాలు, మరమ్మతులకు ఏపీ మార్కెటింగ్ శాఖ ద్వారా అభ్యర్థనను పంపించాలని చెప్పారు. పంట కాలువల్లో, డ్రెయినేజీ కాలువల్లో పూడిక తీత పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎస్.శివరామకృష్ణ మాట్లాడుతూ జింక్ సల్ఫేట్ 21 శాతం టెండర్లు వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు ఆర్థికంగా పురోగమించేందుకు తగిన సాయం అందిస్తుందన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

గుంటూరు వెస్ట్: 2003 ముందు అసైన్డ్ చేసిన వ్యవసాయ భూములు, ఇనాం భూములు, 10 సంవత్సరాల క్రితం అసైన్‌మెంట్ చేసిన నివేశన స్థలాలు క్రమబద్ధీకరించేటప్పుడు ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో జేసీ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి పడుతున్న ఇబ్బందులకు రాష్ట్ర ప్రభుత్వం చక్కని పరిష్కారం చూపిందన్నారు. దీని కారణంలో ఆయా ప్రాంతాల అభివృద్ధి దోహదపడతాయని చెప్పారు. ముఖ్యంగా నిషేధిత జాబితా విషయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

బాలికను అపహరించి.. వదిలి వెళ్లాడు!

పాతగుంటూరులో ఏడో తరగతి విద్యార్థిని కిడ్నాప్ కలకలం

పట్నంబజారు: ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిని గుర్తు తెలియని వ్యక్తి అపహరించి తిరిగి వదలి వెళ్లిన ఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక ఆంజనేయ స్వామి దేవస్థానం సమీపంలో నివాసం ఉండే గర్నెపూడి విజయలక్ష్మి కుమార్తె స్థానికంగా ఉన్న సిటీ పబ్లిక్ స్కూల్లో ఏడో తరగతి చదువుతోంది. ఈ క్రమంలో ఉదయం స్కూల్‌కు వెళ్లిన చిన్నారిని మధ్యలో గుర్తుతెలియని వ్యక్తి బండిపై ఎక్కించుకుని వెళ్లాడు. అయితే స్కూల్‌కు రాలేదని సమాచారం అందుకున్న తల్లిదండ్రులు స్టేషన్‌లో విషయాన్ని తెలియపరిచారు. దీంతో పోలీసులు వెతుకులాట ప్రారంభించిన క్రమంలో మధ్యాహ్నం సమయంలో విద్యార్థిని తీసుకుని వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటి వద్ద వదలివెళ్లాడు. అయితే సదరు వ్యక్తి ఎవరు అనేది తెలియరాలేదు. మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి తీసుకుని వెళ్లి ఉంటాడని భావిస్తున్నారు. విద్యార్థిని తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దూసుకు వచ్చిన మృత్యువు

లారీ ఢీకొని డాక్యుమెంట్ రైటర్ దుర్మరణం

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు దూసుకువచ్చి డాక్యుమెంట్ రైటర్ దుర్మరణం చెందిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని తాలూకా సెంటర్‌లో గురువారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.

గుంటూరు జిల్లా ఫిరంగిపురం గ్రామానికి చెందిన మున్నంగి సాయిరామ్ (35) డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తూ జీవనం వెళ్లదీస్తున్నాడు. గ్రామంలోనే గాక సత్తెనపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పనిచేస్తూ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో వివిధ రుణాలు ఇప్పిస్తుంటాడు. దీనిలో భాగంగా పట్టణంలో కార్యాలయం ఏర్పాటు చేసుకొని నిత్యం సత్తెనపల్లికి వచ్చి వెళుతుంటాడు. గురువారం రాత్రి తన పనులు ముగియగానే ఇంటికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. అదే సమయంలో మోర్జంపాడు నుంచి పెద్దాపురానికి నూగులు లోడు లారీ వెళ్తుంది. సాయిరామ్ రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు పైకి ద్విచక్రవాహనం చేరుకున్న సమయంలో లోడు లారీ వెనుక టైర్ బలంగా తగిలి కొంత దూరం ద్విచక్రవాహనాన్ని ఈడ్చుకు వెళ్లింది. సాయిరామ్ రక్తపు మడుగులో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

రేపు రైల్వే డివిజన్‌లో 'సద్భావన దివస్'



డివిజన్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిని ప్రతి ఏటా ఆగస్టు 20న సద్భావన దివస్‌గా జరుపుకోవడం రైల్వే డివిజన్లో ఆనవాయితీగా వస్తోందని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సద్భావన దివస్ కార్యక్రమం కుల మతాలకు అతీతంగా అన్నీ ప్రాంతాల ప్రజల మధ్య జరుపుకోవడం జరుగుతుందన్నారు.

రైల్వే డివిజన్‌లో ఈనెల 19, 20వ తేదీలలో సెలవు దినాలు కావడంతో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఏడీఆర్ఎం, సీనియర్ డీపీఓ, సీనియర్ డీసీఎం సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ సాగుతో రైతులకు ఖర్చులు తక్కువ

- ప్రకృతి వ్యవసాయ విభాగం పల్నాడు జిల్లా డీపీఎం అమలకుమారి
- ఉన్నవలో ప్రకృతి సాగు పంటల పరిశీలన
- రైతులకు పలు సలహాలు, సూచనలు చేసిన అధికారులు



ఉన్నవలో ప్రకృతి విధానంతో సాగైన పంటను పరిశీలిస్తున్న అధికారులు

యడ్లపాడు: అంతర్ పంటల సాగుతో ఖర్చులు తగ్గి.. ఎర పంటలతో ఆయా పంటలకు చీడపీడల నుంచి రక్షణ ఉంటుందని ప్రకృతి వ్యవసాయం పల్నాడు జిల్లా డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. మండలంలోని ఉన్నవ గ్రామంలో ప్రకృతి విధానంతో సాగు చేసిన వివిధ పంటల్ని శుక్రవారం ఆమె సందర్శించారు. స్థానిక రైతుల్ని ఆయా పంటల సాగు, చీడపీడ నివారణ, యాజమాన్య పద్ధతులు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు అంతర పంటల సాగు, ఎరపంటల ఆవశ్యకతపై పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో రాజీలేని సూత్రాలు తప్పకుండా ఆచరించాలన్నారు. ప్రతి పంటలో అంతర పంటగా ఆరు వరుసలకు ఒక వరుస కంది వేసుకోవాలని సూచించారు. నాటిన 45 రోజులకు సార బీర వంటి తీగ జాతి కూరగాయ విత్తనాలను సాళ్లలో నాటుకోవాలన్నారు. సరిహద్దు పంటలుగా సజ్జ జొన్న మొక్కజొన్న వంటి పంటలు పొలం చుట్టూ నాలుగు వరుసలో నాటుకుంటే మేలన్నారు. ఎర పంటగా ఏడు ఆముదం మొక్కలు, 400 బంతి మొక్కలు ఎకరా పొలంలో నాటుకోవాల్సి ఉంటుందని వివరించారు. అంతర పంటలు ఎరపంటలు సరిహద్దు పంటలు వేసుకోవడం ద్వారా మిత్ర పురుగులు ఆకర్షించి శత్రు పురుగుల వ్యాప్తిని తగ్గించేందుకు దోహదపడతాయన్నారు. అంతర పంటలతో రైతుకు మంచి ఆదాయం కూడా లభిస్తుందన్నారు.

పత్తిలో సస్యరక్షణ

పత్తి విత్తన పది రోజుల తర్వాత ఎకరా పొలంలో 30 నుంచి 40 వరకు పసుపు, తెలుపు, నీలంరంగు జిగురు పూసిన అట్టలు పొలాల్లో ఏర్పాటు చేసుకుంటే రసంపీల్చే పురుగుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. నాటిన 20–30 రోజులకు ఎకరాకు 8 చొప్పున లింగాకర్షక బుట్టల్ని పెట్టుకోవాలని దీంతో గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించి నివారణ చర్యలు పొందే వీలుందన్నారు. 25 రోజుల నుంచి 30 రోజుల వ్యవధిలో ఐదుసార్లు ద్రవ జీవామృతం పారించాలని తెలిపారు. ఇలా రసాయన ఎరువుల వినియోగానికి చెక్ పెట్టి నాణ్యమైన పంట ఉత్పత్తుల్ని సాధించుకోవచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ఏడీపీఎం ప్రేమరాజు, ఉన్నవ ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి పరమాత్మల కోటేశ్వరమ్మ, రైతులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి ఏర్పాట్లు

బాపట్ల: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని జిల్లా లో ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం వార్షిక ప్రణాళికపై క్రీడాప్రాధికార సంస్థ, స్టెప్ అధికారులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని జిల్లాలో జయప్రదం చేయాలని కలెక్టర్ చెప్పారు. అక్టోబరు రెండు నుంచి 36 రోజులపాటు క్రీడా కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖో..ఖో, బ్యాట్మింటన్, క్రికెట్ క్రీడలను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో జరపాలన్నారు. 17 ఏళ్ల దాటిన వారికి క్రీడల్లో అవకాశం ఉంటుందన్నారు. ముందస్తుగా క్రీడా ప్రాంగణాలను ఎంపిక చేసి జాబితా పంపాలన్నారు. పురుషులు, స్త్రీలు ఎంపిక కార్యక్రమాలు పారదర్శకంగా చేపట్టాలన్నారు. నియోజ కవర్గ స్థాయిలో విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.50 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ. 30 వేలు అందజేస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు.

"ఏమేమి పువ్వొప్పనే గౌరమ్మ...
ఏమేమి కాయొప్పనే గౌరమ్మ!
తంగేడు పువ్వులో... తంగేడు కాయలో...
ఆట చిలుకలు రెండు... పాట చిలుకలు రెండు..."

***

"చిత్తూ చిత్తుల బొమ్మ శివుని ముద్దులగుమ్మ
బంగారు బొమ్మ దొరికేనమ్మా ఈ వాడలోన..."



న్యూజెర్సీలో బతుకమ్మ వేడుక (ఫైల్ ఫోటో)

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో!
అమెరికా బతుకమ్మ ఉయ్యాలో!!

''ఇలా ఒకటా... రెండా... లెక్కలేనన్ని బతుకమ్మ పాటలు మా నాలుకల మీద నాట్యమాడుతుంటాయి. గ్రామాల్లో గడిచిన బాల్యం జీవితాన్ని నేర్పుతుంది. తెలంగాణ గ్రామాల్లో బాల్యం బతుకమ్మ పాటల రూపంలో సమాజంలో జీవించడాన్ని నేర్పుతుంది. నిరక్షరాస్యులు కూడా ఈ పాటలను లయబద్ధంగా పాడతారు. బతుకమ్మ పాటల సాహిత్యం వాళ్ల నాలుకల మీద ఒదిగిపోయింది. తమకు తెలిసిన చిన్న చిన్న పదాలతో జీవితాన్ని అల్లేశారు గ్రామీణ మహిళలు. మా నాన్న ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఇంజనీర్. మా అమ్మమ్మ గారి ఊరు జగిత్యాల జిల్లా, వెలుగుమాట్ల. నా చదువు పుట్టపర్తిలో, సెలవులు అమ్మమ్మ ఊరిలో. దసరా సెలవులు వస్తున్నాయంటే సంతోషం అంతా ఇంతా కాదు. దేశమంతా దేవీ నవరాత్రులు జరుపుకుంటూ ఉంటే మేము బతుకమ్మ వేడుకలు చేసుకుంటాం. గౌరమ్మ అందరి మనసుల్లో కొలువుంటుంది, మాట, పాట, ఆట అన్నీ గౌరమ్మ కోసమే అన్నట్లు ఉంటుందీ వేడుక. ఇంత గొప్ప వేడుకకు దూరమయ్యానని అమెరికా వెళ్లిన తర్వాత కానీ తెలియలేదు. అందుకే అమెరికాలో బతుకమ్మను పేర్చాను'' అన్నారు దీప్తి మామిడి... కాదు, కాదు, బతుకమ్మ దీప్తి.

''నేను 2007లో యూఎస్‌కి వెళ్లాను. న్యూజెర్సీలో ఉండే వాళ్లం. పెళ్లయి, ఒక బిడ్డకు తల్లిని. భర్త, పాప, ప్రొఫెషన్‌తో రోజులు బిజీగా గడిచిపోయేవి. డబ్బు కూడా బాగా కనిపించేది. కొద్ది నెలల్లోనే... ఏదో మిస్సవుతున్నామనే బెంగ మొదలైంది. వ్యాక్యూమ్ ఏమిటనేది స్పష్టంగా తెలియలేదు, కానీ బాల్యం, సెలవుల్లో బతుకమ్మ వేడుక మరీ మరీ గుర్తుకు వస్తుండేది. బతుకమ్మ కోసం ఇండియాకి రావడం కుదరక పోతే నేనున్న చోటే బతుకమ్మ వేడుక చేసుకోవచ్చు కదా! అనిపించింది. అలా అక్కడున్న తెలుగువాళ్లను ఆహ్వానించి బతుకమ్మ వేడుక చేశాను. మొదటి ఏడాది పదిహేను మందికి లోపే... పదేళ్లు దాటేసరికి ఆ నంబరు ఐదారు వందలకు చేరింది. అందరికీ భోజనాలు మా ఇంట్లోనే. ఏటా ఒక పెళ్లి చేసినట్లు ఉండేది. ఇండియా నుంచి తెలంగాణ పిండివంటలను తెప్పించుకోవడం, ఆ రోజు వండుకోవాల్సినవన్నీ మా ఇంట్లోనే వండడం, ఆ వంటల కోసం దినుసులను సేకరించడం, స్నేహితులందరినీ ఆహ్వానించడం, పూలు తెచ్చుకుని ఒక్కొక్కటీ పేర్చడం... ఇలా ప్రతి ఘట్టాన్నీ ఎంజాయ్ చేసేదాన్ని. 'ఏటా అంతంత ఖర్చు ఎందుకు' అని స్నేహితులు అనేవాళ్లే కానీ మా వారు ఒక్కసారి కూడా అడగలేదు. నా సంతోషం కోసం చేసుకుంటున్న ఖర్చు అని అర్థం చేసుకునేవారు.



దీప్తి మామిడి

ఎప్పుడూ అన్నం ఉంటుంది!

యూఎస్‌లో మా ఇంట్లో డైనింగ్ టేబుల్ మీద ఎప్పుడూ అన్నం, కూర లుండేవి. మా కన్సల్టెన్సీకి వచ్చిన వాళ్లు, ముఖ్యంగా బ్యాచిలర్స్ కోసం ఈ ఏర్పాటు. మేము యూఎస్‌లో అడుగుపెట్టిన కొన్నాళ్లకే రెసిషన్ వచ్చింది. అప్పుడు పడిన ఇబ్బందులు నాకిప్పటికీ గుర్తే. అందుకే యూఎస్‌కి వచ్చిన కుర్రాళ్లు మన తెలుగింటి రుచులతో భోజనం చేస్తారు కదా! అనుకునేదాన్ని. షడ్రసోపేతమైన భోజనం అని కాదు కానీ కనీసం పప్పుచారయినా ఉండేది. ఈ అలవాటుకు బీజం పడింది కూడా అమ్మమ్మ దగ్గరే. అమ్మమ్మ పెద్ద పాత్రలో అంబలి చేయించి ఇంటి ముందు పెట్టేది. చాలామంది పొలం పనులకు వెళ్తూ దారిలో మా ఇంటి ముందాగి అంబలి తాగి, ఆవకాయ ముక్క చప్పరించుకుంటూ వెళ్లేవాళ్లు. ఆకలి తీర్చడంలో, అవసరమైన వాళ్లకు సహాయం చేయడంలో ఉండే సంతృప్తి మరి దేనిలోనూ ఉండదు. మా డ్రైవర్ ఇతర పనివాళ్ల పిల్లల చదువు కోసం ఫీజులు కట్టినప్పుడు మరొకరి జీవితానికి మనవంతు సహాయం చేస్తున్నామనే భావన సంతృప్తినిస్తుంది. అవకాశం లేనప్పుడు ఎలాగూ చేయలేం, వెసులుబాటు ఉన్నప్పుడయినా చేసి తీరాలి. మన ఎదుగుదల కోసం సమాజం నుంచి మనం తీసుకుంటాం, మనం ఎదిగిన తరవాత మరొకరి ఎదుగుదల కోసం ఆపన్న హస్తాన్ని అందించి తీరాలనేది పుట్టపర్తి స్కూల్ నేర్పించిన వాల్యూ బేస్డ్ ఎడ్యుకేషన్. మా అమ్మ ఫ్రెండ్ లీలా ఆంటీ కూడా బతుకమ్మ పండుగను బాగా చేసేవారు. ఆమె ఎన్విరాన్‌మెంట్ యాక్టివిస్ట్. గునుగుపూలు వాటర్‌బాడీస్‌ని శుద్ధి చేస్తాయని చెప్తూ ఈ పండుగ వెనుక ఉన్న పర్యావరణ పరిరక్షణను వివరించేవారు. ఇవన్నీ మైండ్‌లో ఒక్కటొక్కటిగా అల్లుకుంటూ ఇలా దండ కూర్చుకున్నాయి.

బతుకమ్మ దీప్తినయ్యాను!

యూఎస్ జీవితం నాకు చాలా నేర్పించిందనే చెప్పాలి. అక్కడ అన్నీ ఉంటాయి కానీ ఏదో లేదనే వెలితి. రొటీన్ లైఫ్‌ని జాయ్‌ఫుల్‌గా మలుచుకోవడానికి నాకు బతుకమ్మ ఒక దారి చూపించింది. అప్పట్లో యూఎస్ ఇంతగా ఇండియనైజ్ కాలేదు. ఇప్పుడైతే న్యూజెర్సీ, డాలస్‌తోపాటు కొన్ని నగరాలు పూర్తిగా భారతీయలవే అన్నట్లు, తెలుగువాళ్ల ఊళ్లే అన్నట్లయిపోయాయి. మన పండుగలు ఇప్పుడు అందరూ చేసుకుంటున్నారు. నేను మొదలుపెట్టడంతో నేను బతుకమ్మ దీప్తినయ్యాను. 'దీప్తి మామిడి'గా అమెరికాలో అడుగుపెట్టాను. మూడేళ్ల కిందట తిరిగి వచ్చేటప్పటికి నా పేరు 'బతుకమ్మ దీప్తి'గా మారింది. బతుకమ్మ పాటకు మ్యూజిక్ మొదలైతే చాలు... ఒళ్లు పులకించిపోతుంది. పూనకం వచ్చినట్లే ఉంటుంది. మీతో మాట్లాడుతున్నా సరే... బతుకమ్మ ఫీల్ వచ్చేస్తుంది. చూడండి గూజ్‌బంప్స్ వచ్చేశాయి'' అని చేతులను చూపించారు బతుకమ్మ దీప్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

న్యూస్‌మేకర్ - లక్ష్మి

గిరిజన సరస్వతి

జె.ఇ.ఇ. ఎంట్రన్స్‌లో ర్యాంకు కొట్టడం సామాన్యం కాదు. అందుకై కొందరు రాజస్తాన్ వెళ్తారు. కొందరు హైదరాబాద్, విజయవాడ చేరుకుంటారు. తల్లిదండ్రులు గైడ్ చేస్తారు. కాని నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు పుట్టిన కోయ విద్యార్థిని కొర్సా లక్ష్మి గురుకుల పాఠశాలలో చదువుకునే మంచి ర్యాంకు సాధించింది. పాట్నా ఐఐటీలో సీటు సాధించింది. కోయలలో ఒక అమ్మాయి సాధించిన స్ఫూర్తినిచ్చే విజయం ఇది. కొర్సా లక్ష్మి పరిచయం.

కొంతమంది ఇళ్లల్లో, నిజానికి చాలామంది ఇళ్లల్లో పిల్లలు జె.ఇ.ఇ. ఎంట్రన్స్ రాయడానికి తల్లిదండ్రులు చాలా శ్రద్ధ పెడతారు. బాగా చదివించే కోచింగ్ సెంటర్ కోసం అవసరమైతే రాజస్థాన్‌లోని కోటాకు వెళతారు లేదా హైదరాబాద్, విజయవాడలలో ప్రఖ్యాత కోచింగ్ సెంటర్‌లలో వేస్తారు. ఇక పిల్లలు ఇంట్లో ఉండి చదువుకుంటుంటే టీవీలు బంద్ చేస్తారు. మాటా పలుకూ లేకుండా పిల్లలు ఇరవై నాలుగ్గంటలూ



తండ్రి కన్నయ్య, తల్లి శాంతమ్మలతో లక్ష్మి

చదువుకునేలా చేస్తారు. మెటీరియల్ తెచ్చిస్తారు. చాలా హైరానా పడతారు. అదేం తప్పు కాదు. కాని ఇలాంటివన్నీ లేకుండా కూడా కొంతమంది విజయం సాధిస్తుంటారు. కొత్తగూడెంలోని గిరిజన గురుకుల పాఠశాలలో చదువుకున్న కోయ విద్యార్థిని కుర్సా లక్ష్మి అలాంటి విజేతే. పట్టుదలతో చదువుకుని ర్యాంకు సాధించిన విజేత.

ఐసులమ్మే తండ్రి కూతురు

కొత్తగూడెం నుంచి దాదాపు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజన తండా కాటాయగూడెం. 300 గడపలున్న గ్రామం ఇది. అందరూ కోయలే. వ్యవసాయ కూలీలే. ఏ కొద్ది మందికో కాసింత భూమి ఉంటుంది. కొర్సా లక్ష్మి తండ్రి కన్నయ్యకు ఎకరం భూమి ఉంది. కాని వాన పడితేనే పండుతుంది. కన్నయ్య వ్యవసాయ కూలీగా వెళతాడు. తల్లి శాంతమ్మ కూడా. వ్యవసాయ పనులు లేనప్పుడు తన టీవీఎస్ ఎక్సెల్ మీద ఐస్ బాక్స్ పెట్టుకుని ఐసులమ్ముతాడు. ముగ్గురు పిల్లలు. కాని పెద్ద కొడుకు చదువు ఇష్టం లేక 7వ తరగతిలో ఇంట్లో నుంచి పారిపోయాడు. రెండో కొడుకు మామూలు చదువే. చివరి అమ్మాయి లక్ష్మి బాగా చదువుకోవాలని నిశ్చయించుకుంది.

పిన్ని స్ఫూర్తి

కన్న తల్లిదండ్రులు చదువు లేని వారు కావడాన లక్ష్మికి చదువులో ఏ సాయమూ చేయలేకపోయేవారు. ఆరవ తరగతి నుంచి కొత్తగూడెం గిరిజన గురుకుల పాఠశాలలో చదువుతున్న లక్ష్మికి పిన్ని సుమలత స్ఫూర్తిగా నిలిచింది. డిగ్రీ చదువుకున్న సుమలత హాస్టల్‌లో ఉన్న లక్ష్మిని తరచూ కలుస్తూ చదువు విలువ చెబుతూ వచ్చింది. డబ్బుకు విలువ ఇవ్వని వారు కూడా చదువుకు విలువ ఇస్తారని తెలిపింది. సెలవుల్లో ఇంటికి తీసుకువచ్చి లక్ష్మి మంచి చెడ్డలు చూసేది. ఆమె మాటలు లక్ష్మి మనసులో నాటుకుపోయాయి. 'ఏ రోజూ కూడా రాత్రి ఒంటి గంట లోపు లక్ష్మి పుస్తకం మూయగా చూడలేదు' అని లక్ష్మి బాబాయ్ రవి తెలిపాడు.

గురుకుల పాఠశాలలో

కొత్తగూడెంలోని గిరిజన గురుకుల పాఠశాలలో దాదాపు వేయి మంది అమ్మాయిలు 6 నుంచి ఇంటర్ వరకూ చదువుతున్నారు. ప్రిన్సిపాల్ దేవదాసు, ఉపాధ్యాయులు వీరి చదువు మీద బాగా శ్రద్ధ పెడుతున్నారు. చురుకైన విద్యార్థినులను ఎంపిక చేసి జె.ఇ.ఇలో శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్‌లో ఎం.పి.సి తీసుకున్న లక్ష్మి 992 మార్కులు సాధించింది. దాంతో ఇంకా ఉత్సాహంతో జె.ఇ.ఇకి ప్రిపేర్ అయ్యింది. జె.ఇ.ఇ అడ్వాన్స్‌డ్‌లో 1371వ ర్యాంకు సాధించింది. పాట్నా ఐ.ఐ.టిలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో మొన్నటి ఆగస్టు మొదటివారంలో సీటు పొందింది. గురుకుల పాఠశాల నుంచి ఈ ఘనత సాధించిన అమ్మాయి లక్ష్మే.

ఐ.ఎ.ఎస్ చేయాలని...

బాగా చదువుకుని ఐ.ఎ.ఎస్ చేయాలనేది తన లక్ష్యమని కొర్సా లక్ష్మి చెప్పింది. జె.ఇ.ఇలో మంచి ర్యాంకు సాధించి ఐ.ఐ.టిలో సీటు పొందడంతో ఐ.టి.డి.ఎ అధికారులు లక్ష్మిని ప్రశంసించారు. ట్యాబ్ ఇచ్చి ఆర్థిక సహాయం చేశారు. లక్ష్మి ఇంత బాగా చదవడంతో ఇంకా కొంతమంది ఆమె చదువును ప్రోత్సహించడానికి ముందుకొచ్చారు. ఆ ప్రోత్సాహం వల్ల లక్ష్మి ఐ.ఎ.ఎస్ చదివి పేద వర్గాల కోసం పని చేయాలని నిశ్చయించుకుంది.



నేడు వరల్డ్ ఫొటోగ్రఫీ డే

వారియర్ కెమెరా

● కర్తవ్యాన్ని గుర్తు చేసే కెమెరా కన్ను

ఆరతి కెమెరాతో మాట్లాడి చూడండి...
చేపల సవ్వడి లేని నదుల దీనత్వాన్ని గురించి చెబుతుంది.
చేవ లేని జీవజాలాన్ని గురించి చెబుతుంది.
పచ్చదనాన్ని కోల్పోయి నేలకూలనున్న నిర్జీవ వృక్షాల మృత్యుఘోష చెబుతుంది.
నదుల నీటిలోని విషాన్ని గురించి వివరంగా చెబుతుంది.
స్థూలంగా చెప్పాలంటే...కనిపించే అందాల వెనుక కనిపించిన నిశ్శబ్ద విధ్వంసాన్ని గురించి కళ్లకు కడుతూ చెబుతుంది.
బెంగళూరుకు చెందిన ఎన్విరాన్‌మెంటల్ ఫొటోగ్రాఫర్ ఆరతి కుమార్ రావు తన కెమెరాతో పర్యావరణ సంరక్షణం గురించి క్షణం క్షణం గుర్తు చేస్తోంది...

ప్రతి కెమెరాకు ఒక దృష్టి ఉంటుంది. మరి ఆరతి కెమెరా చూసేది ఏమిటి?

అట్టడుగున పడి కన్పించని కథలు, నిజజీవిత కథలు, పట్టించుకోవాల్సిన అవసరం ఉన్నా ఎవరూ పట్టించుకోని కథలు, సంప్రదాయ జీవనశైలులు, వాటిలో వస్తున్న అనూహ్య మార్పులు, పదాలకు దొరకని దృశ్యాలు...ఇలా ఎన్నో ఎన్నెన్నో.

చిన్నప్పటి నుంచి 'నేషనల్ జియోగ్రఫీ' పత్రికలను చూస్తూ పెరిగింది ఆరతి. ఆ ఎల్లో బార్డర్ విండోస్ నుంచి విశాలమైన ప్రపంచాన్ని చూసింది. ఆ పత్రికలోని ఫొటోగ్రాఫ్స్ తనపై ఎంతో ప్రభావం చూపాయి. పదాలతోనే కాదు చిత్రాలతో కూడా గొప్ప సత్యాలు చెప్పవచ్చుననే విషయం అర్థమైంది.

చిన్నప్పటి నుంచి ఫిజిక్స్ అంటే ఇష్టం ఉన్న ఆరతి బయోఫిజిక్స్‌లో మాస్టర్స్ చేసింది.

ఆ తరువాత 'లైఫ్‌టైమ్ టు-డూ' రూపంలో భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకుంది. దానిలో నదులతో పరిచయం ఒకటి. నదులను, వాటి చుట్టూ ఉండే జీవితాన్ని ఫొటోల రూపంలో డాక్యుమెంట్ చేయాలనుకుంది.

కాళ్లకు బలపాలు, కళ్లకు కెమెరాలు కట్టుకొని ఊరూరు తిరిగినా తల్లిదండ్రులు ఎప్పుడూ అభ్యంతర పెట్టలేదు. పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. వివిధ ప్రాంతాలలో తన ఫొటోగ్రఫీకి సంబంధించిన విషయాలను కుటుంబసభ్యులతో పంచుకునేది ఆరతి.

ఫొటోల ద్వారా ఎన్విరాన్‌మెంటల్ స్టోరీ టెల్లింగ్‌లో నేర్పు సంపాదించిన ఆరతి తన ప్రయాణంలో ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది. పర్యావరణం గురించి మాట్లాడే వారిని అభివృద్ధి వ్యతిరేకులుగా భావించే వారిని కూడా చూసింది.

'రివర్ డైరీస్' అనేది ఆమె ప్రస్థానంలో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్‌గా పేరు తెచ్చుకుంది. నదుల అందాలతో పాటు వాటికి ఎదురవుతున్న ఆపదలకు 'రివర్ డైరీస్' అద్దం పడతాయి.



ఆరతి కుమార్ రావు







చిత్రాలు: ప్రకృతి, ప్రకృతితో ముడిపడిన మనిషి జీవితం

'హింస, వివాదాలు మాత్రమే హెడ్‌లైన్‌గా కనిపిస్తాయి. అయితే పర్యావరణ విధ్వంసం అనే భయానకమైన కనిపించని హింస చాపకింద నీరులా కొనసాగుతుంది' అంటుంది ఆరతి. ఆ కనిపించని హింసమూలాలను నలుగురికి తెలియజేసేలా చేయడంలో తన కెమెరాను బలమైన మాధ్యమంగా ఉపయోగించుకుంటోంది.

ఆరతి ఫొటోగ్రాఫర్ మాత్రమే కాదు రచయిత్రి కూడా. ఆమె పుస్తకాలలో 'మార్జిన్‌ల్యాండ్స్: ఇండియన్ ల్యాండ్‌స్కేప్స్ ఆన్ ది బ్రింక్' ఒకటి. ఇందులో లడఖ్ నుంచి సుందరబన్ వరకు ప్రకృతికి సంబంధించిన ఎన్నో సుందరచిత్రాలను కళ్లకు కడుతుంది. గంగ–బ్రహ్మపుత్ర–మేఘన పరీవాహక ప్రాంతాలకు తీసుకువెళుతుంది. భౌగోళిక అందాలతో పాటు ఎదురవుతున్న ప్రమాదాలను, అక్కడి ప్రజలు మాట్లాడుకునే పదాలను పరిచయం చేస్తుంది.

'నిర్మాణాలు, ఇతరత్రా విధ్వంసక కార్యకలాపాల వల్ల ప్రమాదం అంచున ఉన్న ప్రకృతిని కాపాడు కోవడం అనేది మన చేతిలోనే ఉంది' అని ఈ పుస్తకం ద్వారా చెబుతుంది ఆరతి.

'పర్యావరణంలో వచ్చే మార్పులు, అవి మన జీవితాల్లో తెచ్చే మార్పులను నా కెమెరా ద్వారా ఇక ముందు కూడా కథలుగా చెప్పాలనుకుంటున్నాను' అంటోంది ఆరతి.

ఒకానొక సందర్భంలో తన నిరసన గళాన్ని ఇలా వినిపించింది ఆరతి,,,,

'కరువుకాటకాలు, వరదలలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మాత్రమే పర్యావరణ విధ్వంసం, పరిరక్షణ గురించి మాట్లాడుకుంటారు. ఆ తరువాత ఎవరి పనుల్లో వారు మునిగిపోతారు'

అయితే ఆరతిలాంటి ఎన్విరాన్‌మెంటల్ ఫొటోగ్రాఫర్‌లు తమ చిత్రాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు సంబంధించి మన కర్తవ్యాన్ని ఎప్పటికప్పుడు గుర్తు చేస్తూనే ఉన్నారు.

కవితకేదీ కాదు అనర్హం అన్న చందాన మెటల్, ప్లాస్టిక్, పాత గాడ్జెట్స్ ఏదైనా ఆయన చేతిలో పెట్టారంటే అందమైన శిల్పంగా మారాల్సిందే. అరవైఏళ్ల వయసులో చిన్నప్పటి హాబీని కెరీర్‌గా మలుచుకున్నాడు విశ్వనాథ్ మల్లాబ్ది దావంగిరె. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకో ఆర్ట్‌గా మార్చి అబ్బురపరుస్తున్నాడు ఈ పెద్దాయన.

ఈ-వేస్ట్ శిల్పి



విశ్వనాథ్

బెంగళూరుకు చెందిన విశ్వనాథ్ తండ్రి డీఎమ్ శంభు ప్రముఖ శిల్పి ఇంకా పెయింటర్ కూడా. విశ్వనాథ్ మెడిసిన్ చదివి మంచి డాక్టర్ కావాలని శంభు కలలు కనేవారు. చిన్నప్పటి నుంచి సెకండ్ హ్యాండ్ వస్తువులను సరికొత్తగా మార్చడమంటే విశ్వనాథ్‌కు ఆసక్తి ఎక్కువ. ఫైన్ ఆర్ట్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేయాలని నిర్ణయించుకున్నాడు.

చదువు పూర్తైన తరువాత తరువాత మీడియాలోకంప్యూటర్ వీడియో గ్రాఫిక్ ఆర్టిస్ట్‌గా చేరాడు. అలా కెరీర్ ప్రారంభించిన విశ్వనాథ్ ఒక్కోమెట్టు ఎదుగుతూ విప్రోలో చేరాడు. ఇక్కడ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూనే ఖాళీ సమయం, వారాంతాలలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకోఆర్ట్‌గా ఎలా మార్చాలని పరిశోధిస్తుండేవాడు. రకరకాల ప్రయోగాల తరువాత.. గాడ్జెట్స్ వ్యర్థాలను ఉపయోగించి చిన్నచిన్న జంతువులు తయారు చేశాడు. అవి ముద్దుగా ఎంతో ఆకర్షణీయంగా ఉండడంతో తన ఇకో ఆర్ట్‌ను పెంచుకుంటూ పోయాడు.



ఫ్యాషన్ జ్యూవెలరీ నుంచి అందమైన శిల్పాలు, రోబోలదాకా అన్ని ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో తయారు చేస్తున్నాడు.


ఏరికోరి ఎంచుకుని...

ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి ప్రాణాంతకంగా మారాయని తెలుసుకుని ఇకో ఆర్ట్‌ను మరింత సీరియస్‌గా తీసుకున్నాడు విశ్వనాథ్. ఈ క్రమంలోనే ఈ వ్యర్థాలను కొనుక్కునేవాడు. అన్నింటిని గంపగుత్తగా కొనకుండా కంప్యూటర్ విడిభాగాలు, ల్యాప్‌టాప్స్, డేటా కార్డులు, డీవీడీ, వీసీఆర్, ఫ్లాపీ డ్రైవ్స్, సెట్-టాప్‌బాక్స్‌లు, ల్యాండ్‌లైన్, కార్డ్‌లెస్ ఫోన్‌లు, గ్లూకో మీటర్లను ఏరికోరి ఎంచుకుని తీసుకునేవాడు. వీటిలో కూడా రాగి, బంగారం, రంగు రంగుల వైర్లు, కీబోర్డులను ప్రత్యేకంగా సేకరించి రకరకాల బొమ్మల రూపకల్పనకు ఉపయోగిస్తున్నాడు. ఆరు అడుగుల అమ్మాయి రూపంతో విగ్రహం, ప్రముఖ వ్యాపారవేత్త అజీం ప్రేమ్‌జీ ఫోటో, ఇకో జ్యూవెలరీ, కీబోర్డు కామధేనువు వంటి బొమ్మలు ఐదు వందలకు పైగానే తయారు చేశాడు.

హాబీని కెరీర్‌గా...

విశ్వనాథ్ తయారు చేసిన బొమ్మలు ఆకర్షణీయంగా అందంగా ఆకట్టుకుంటుండడంతో విక్రయించడం మొదలు పెట్టాడు. రెండేళ్ల క్రితం రిటైర్ అయిన విశ్వనాథ్.. తొలినాళ్లల్లో హాబీగా ఉన్న ఇకోఆర్ట్‌ను పూర్తి సమయం కేటాయిస్తూ ఇకోఆర్ట్ వస్తువులు విక్రయిస్తూ సరికొత్త కెరీర్‌ను సృష్టించుకున్నాడు. ఇకోఆర్ట్ వస్తువులు కొనే కస్టమర్లు ఢిల్లీలోనేగాక, యూరప్, నెదర్లాండ్స్, అమెరికా వంటి దేశాల్లో ఇకో ఆర్ట్ కోసం కస్టమర్లు ఎగబడుతున్నారు. దేశంలోనేగాక విదేశాల్లో తన ఇకో ఆర్ట్‌ను ప్రదర్శిస్తూ మంచి ఆదరణ పొందుతున్నాడు.







వందల కేజీలపైనే...

కీబోర్డు కీల నుంచి గోడగడియారంలో భాగాల వరకు అన్నీ సేకరించి ఇకో ఆర్ట్ రూపొందిస్తోన్న విశ్వనాథ్ ఇప్పటిదాకా రెండువందల కేజీల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకో ఆర్ట్స్‌గా మార్చాడు. అయితే ఈ ఇకో ఆర్ట్ అంత సులభం కాదని విశ్వనాథ్ చెబుతున్నాడు. ''ఈ – వ్యర్థాల నుంచి ఆర్ట్ కావాల్సిన భాగాలను సేకరించి వాటికి ఆకారం, రంగు వేసి తుదిమెరుగులు దిద్దడానికి చాలా సమయం పడుతుంది. జ్యూవెలరీ తయారు చేయడానికి రెండు మూడు నిమిషాలు పడితే, శిల్పాలు తయారు చేయడానికి వారాలు, నెలలు పడుతుంది. అయినప్పటికీ ప్రస్తుతం రీసైక్లింగ్ చేసిన ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. ఇటు కస్టమర్ల మనసు దోచుకోవడంతోపాటూ, పర్యావరణానికి హానీ కలగకుండా ఈ ఇకోఆర్ట్ ఎంతో సంతృప్తినిస్తుంది. ముందు ముందు మరిన్ని కళారూపాలు తీసుకురానున్నాను''అని విశ్వనాథ్ చెబుతున్నాడు.